: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం  ADIKAVI NANNAYA UNIVERSITY

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 సంచిక : 47 21-08-2023 పుటలు : 4+2

# నన్నయ రిజిస్ట్రార్‌గా ఆచార్య జి. సుధాకర్



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ నూతన రిజిస్ట్రార్ గా ఆంధ్ర విశ్వవిద్యాలయ హ్యూమన్ జెనిటిక్స్ విభాగాధిపతి ఆచార్య గోడి సుధాకర్ ను నియమిస్తూ వీసీ ఆచార్య కె.పద్మరాజు ఉత్తర్వులను అందజేశారు. శుక్రవారం యూనివర్సిటీ వీసీ కార్యాలయంలో వీసీ చేతుల మీదుగా ఉత్తర్వులను అందుకున్న జి.సుధాకర్ రిజిస్ట్రార్ గా బాధ్యతలు స్వీకరించారు. నన్నయ వీసీ ఆచార్య కె.పద్మరాజు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఆచార్య జి.సుధాకర్ దేశ ధాన్యాగారమైన గోదావరి జిల్లా వాసి కావడం విశేషం. ఆయన పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో జన్మించి, వీరవాసరంలో విద్యాభ్యాసాన్ని సాగించారు. ఎమ్మెస్సీ హ్యూమన్ జెనిటిక్స్ తో పాటు ఎంఇడి సైకాలజీ స్పెషల్, పిహెచ్.డి.ఆంధ్ర యూనివర్సిటీలో పూర్తి చేసారు. 30 ఏళ్ళ పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ గా, అసోసియేట్ ప్రొఫెసర్ గా, ప్రొఫెసర్ గా ఏయూలో విధులు నిర్వహిస్తున్నారు. బోధన, పరిశోధన రంగాల్లో అనుభవం కలిగిన ఆచార్యునిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆచార్య సుధాకర్ దగ్గర 40 మంది పరిశోధకులు పిహెచ్.డి లు అందుకున్నారు. అలాగే 15 మందికి ఎంఫిల్ కు గైడ్ గా వ్యవహరించారు. 143 జనరల్ ఆర్టికల్స్, 2 ఛాప్టర్ బుక్స్, 96 కాన్ఫరెన్స్ ప్రొసీడింగ్స్, 6 ప్రాజెక్టులతో పరిశోధన, ప్రచురణలలో విశేష కృషి చేసారు. పలు రీసెర్చ్ ప్రాజెక్టులు, జాతీయ అంతర్జాతీయ సదస్సులను విజయవంతంగా నిర్వహించారు. ఆంధ్ర యూనివర్సిటీ స్టూడెంట్ ఎఫైర్స్ డీన్ గా, స్పెషల్ ఆఫీసర్ గా, ఆయా ప్రత్యేక పరీక్షలకు రిజినల్ కోఆర్డినేటర్ గా యూనివర్సిటీ పరిపాలన వ్యవహారాల్లో మెరుగైన సేవలందించారు. ఏయూ కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ గా భారీ మెజార్టీతో విజయం సాధించారు. అలాగే ఇంటర్నేషనల్ సైంటిస్ట్ అవార్డు తిస - 2020, ఆదర్శ్ విద్యా సరస్వతి రాష్ట్రీయ పురస్కారం (నేషనల్ అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్ 2020), డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డు - 2019 వంటి పురస్కారాలు, అవార్డులు సుధాకర్ అందుకున్నారు. నూతనంగా రిజిస్ట్రార్ గా నియమితులైన సందర్భంగా ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ గా నియమించిన వీసీ కి ధన్యవాదాలు తెలిపారు. గోదావరి జిల్లాలో పుట్టి గోదావరి విశ్వవిద్యాలయంగా పేరుపొందిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి రిజిస్ట్రార్ గా సేవలందించే అవకాశం దక్కడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తానని, తన 30 ఏళ్ళ విద్య, పరిశోధన, పరిపాలన అనుభవాన్ని సద్వినియోగం చేసుకుంటూ నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్దే లక్ష్యంగా పని చేస్తానని తెలియజేసారు. విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది నూతనంగా నియమితులైన రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ కు శుభాకాంక్షలను తెలియజేసారు.






# ఆచార్య టి.అశోక్ సేవలు అభినందనీయం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ గా ఆచార్య టి.అశోక్ ఎక్కువ కాలం సేవలందించారని వీసీ ఆచార్య కె.పద్మరాజు సన్మానించి అభినందించారు. శనివారం యూనివర్సిటీ ఈసీ హాల్ లో ఇప్పటి వరకు రిజిస్ట్రార్ గా సేవలందించిన ఆచార్య టి.అశోక్ ను విశ్వవిద్యాలయ అధికారులు సన్మానించి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆచార్య టి.అశోక్ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ గా రెండు పర్యాయాలు విశేషమైన సేవలందించారని అన్నారు. ఆచార్య టి.అశోక్ నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ గా 28.08.17 నుంచి 15.11.18 వరకు పని చేసారని, తిరిగి 23.01.21 నుండి నేటి వరకు సేవలందించారని తెలియజేసారు. విశ్వవిద్యాలయ అధికారులతోను, సిబ్బంది తో సౌమ్యంగా వ్యవహరిస్తూ పరిపాలన వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొన్నారని చెప్పారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య జి.సుధాకర్ గోదావరి జిల్లా వాసి కావడం విశేషమన్నారు. గోదావరి జిల్లా విశ్వవిద్యాలయమైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేయాలని తెలియజేసారు. విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు శుభాకాంక్షలు తెలియజేసారు.

# సంపాదకీయం



## జానపద దినోత్సవం

ఒక జాతి సంస్కృతిని, సంప్రదాయాన్ని పొదుగుకున్న కమ్మని తెలుగు పదాలకు నిలయం జానపదాలు. వీటిని పరిశోధనల్తో పుస్తకాలకెక్కించి నిలవ మాత్రమే చేయగలిగాం. వాటిని పాడుకోవడానికి సంబంధించిన బాణీలు, ఉచ్చారణలు,స్వరాలు అవన్నీ పదిలపరచడానికి సంబంధించిన నేపథ్యమైతే మాత్రం ఇప్పుడు అంత తేలికైన మాట మాత్రం కాదు.

పాట మనిషి మనసును శుద్ధి చేస్తుందంటారు తల్లీభూదేవి నవలలో చెంఘీజ్ ఐతోమాతోవ్. ఒకనాటి తెలుగు పల్లెటూళ్లలో అన్ని సందర్భాలకు పాటలే వారికి గొప్ప ఆటవిడుపుగా ఉండేవి. శ్రమను తగ్గించుకోవటానికి కొత్త ఉపాయాలు పన్నటం,దానికి పాటను ఆసరాగా తీసుకోవటం ఉండేది. తెలుగు జానపదాల్లో ఎన్నో మాటలు తాటిమొవ్వ వాసనతో, కాల్బినతేగల నుంచి వచ్చే కమ్మని తీపి గుబాళింపుగా మన మధ్య కళకళలాడుతుండేవి. జానపద బాణీల్లో కొన్ని మాటలు మన చెవులకు తాకినప్పుడు ఇటువంటి అనుభవమే ఎదురయ్యేది. కాలక్రమేణా బోలెడు మాటలు కనుమరుగయ్యాయి.యంత్ర నాగరకత బలిసిన సందర్భంలో ఒకనాటి పనిముట్లు, పనులు,ఎడ్లబళ్లు, నాగళ్ళు, వరి ఊడ్పులు, కోతలు, పండించే విధానంలో శ్రమజీవుల పాత్రను బట్టి మాటలు, పాటలు, ఎకసెక్కాలు, పరిహాసం ఇవన్నీ కనుమరుగై జీవన విధానంలో పచ్చి తగ్గిపోయి ఎండుదనం నిండిపోయి బతుకు మోడుబారిపోతుంది. పల్లెలు పెరిగి బస్తీలై అవి ముదిరి నగరాలుగా రూపుదిద్దుకున్నాక ఒకప్పటి జానపదుల జీవితాల్లో భాగంగా ఉన్న ప్రజా కళలు, ప్రదర్శక కళలు అంతరించిపోయాయి. ఒక కళ అంతరించటంతో దాని చుట్టూ ఉండే జీవద్భాష కూడా అంతరించిపోతుంది.

నీ దగ్గర రెండు పైసలు ఉంటే ఒక పైసాతో లిల్లీ పూవు కొనుక్కో...అని చైనా సామెత. మనిషి ఎంత లేమిలో ఉన్నా కళాదృష్టితో బతకాలన్నది పైమాట సారాంశం. ప్రతి విషయాన్ని డబ్బుతో ముడిపెట్టే వారి దగ్గర ఇటువంటి మాటలు మాట్లాడడం అనవసరం. ఆధునిక నాగరకత, బ్రతుకు బండి డబ్బు చుట్టూ తిరుగుతుంటుంది. మడిసన్నాక కూసింత కళాపోసన ఉండాల... అనే మాటకు తీరికెక్కడిది.


జానపదులు,జానపద గీతాలు, సామెతలు,జానపద, బొమ్మలాటలు లాంటి మాటలు మాట్లాడితే... అంటే ఏంటని? అడుగుతారు ఇప్పుడున్న పిల్లలు. అంటే ఏంటో చెప్పలేనంత దూరం వచ్చేశాం.అటువంటి పాఠాల్ని కరికులంలో పెడితే నాన్సెన్స్ పాత చింతకాయ పచ్చడి అనే ప్రబుద్ధులు బోలెడంతమంది. తరతరాల సంస్కృతిలో మనం పోగొట్టుకుంటున్నవన్నీ మనకు నాన్సెన్స్.

తాతగారి ఫోటో భద్రపరచలేని వాళ్ళు, తల్లిదండ్రులను ఓల్డేజ్ హోమ్ లో ఉంచే వాళ్ళ శాతం పెరిగిపోయాక సంస్కృతి, సంప్రదాయం,వారసత్వం,కళలు, కళాఖండాలు, సంగీతం, నృత్యం, సంతోషం, ఆనందం లాంటి పదాలు నీతి వాక్యాలుగా, రంగు మాసిపోయిన పదాలుగా కనిపిస్తాయి.వినిపిస్తాయి.

పోన్లెండి.ఇలా ఆగస్టు 22 న జానపద దినోత్సవాలు జరిపినప్పుడు, వాటి ప్రస్తావన వచ్చినప్పుడు ఏవో కొన్ని మాటలు, పాటలు, మంగ్లీ లాంటి మహాతల్లి ఖంగుమనే గొంతు మన గుండెల్ని తాకకమానదు. కొంతమందికి నడుస్తున్న కాలం కంటే గడిచిపోయిన కాలం బాగున్నట్టు అనిపిస్తుంది. గతకాలం మేలు వచ్చుకాలంకంటె అన్నారు నన్నయ. రాబోయే కాలం మీద ఊహల ఊడలు పెంచుకొని వాటిని పట్టుకుని ఊగడంలో మజా వేరు కదా! ఊగనివ్వండి. కాలం గడిచే కొద్ది కొన్ని చేవతేల్తాయి.కొన్ని రాల్తాయి.అంతే!

## నందంపూడి శాసనాన్ని ఆవిష్కరించిన ఎంపీ భరత్, లక్ష్మీపార్వతి, వీసి

**16.08.23 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న 'నన్నయ మహా భారత రచన, రాజరాజ నరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది' మహోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు సాహిత్య అకాడమీ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ సహస్రాబ్ది మహోత్సవాలు ప్రారంభ సూచికగా నందంపూడి శాసనాన్ని (రాగి రేకులపై ఉన్న వాటిని) శాశ్వతంగా పది మందీ వీక్షించేలా 'సన్దమ పూణ్డి శాసనం' శిలా ఫలకంపై చెక్కించారు. ఈ శిలా శాసనాలను రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్, తెలుగు సంస్కృత అకాడమీ-తెలుగు సలహా మండలి ఛైర్పర్సన్ నందమూరి లక్ష్మీ పార్వతీ, వీసీ ఆచార్య కె.పద్మరాజు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ ఇటువంటి అరుదైన శాసనాలను పది కాలాల పాటు పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు నిర్ణయం అభినందనీయమని అన్నారు. వెయ్యేళ్ళ చరిత్ర గల రాజమహేంద్రవర వైభవాన్ని ప్రతిబింబించే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని చేపడతామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



## నన్నయలో మేరి మాటి మేర దేశ్ ప్రోగ్రాం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆవరణలో మేరి మాటి మేర దేశ్ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.ఎస్.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో విత్తనం నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయ నిర్మల, కార్యక్రమాన్ని ప్రారంభించి కళాశాల ఆవరణంలో విత్తనాలు నాటారు. వివిధ రకాల కూరగాయ విత్తనాలను నాటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు




## విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

విద్యార్థులంతా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, తద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ డిపార్టమెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, బిట్ క్లబ్ ఆధ్వర్యంలో "అప్ స్కిల్" అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ ఆచార్య కె.పద్మరాజు విద్యార్థులనుద్దేశి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. సమాజంలో ఉన్నత స్థానాలకు చేరడానికి మంచి లక్షణాలను, విలువలను అలవర్చుకోవాలన్నారు. విద్యతో పాటు వివిధ స్కిల్స్ ను పెంచుకోవాలని, ఇంటర్వ్యూల సమయంలో వాటి ఆధారంగానే ఉద్యోగాలు లభిస్తాయని ఉదాహరణలతో వివరించారు. బిట్ క్లబ్ ఆధ్వర్యంలో అప్ స్కిల్ పేరుతో ఉద్యోగాలకు సిద్ధపడే విధానాలను విద్యార్థులకు తెలియజేయడం కోసం ఏర్పాటు చేసిన ఇటువంటి కార్యక్రమంలో ఎంతో ఉపయోగకరమని నిర్వహకులను అభినందించారు. ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకొనే మార్గాలను విద్యార్థులకు సూచించారు. విభాగాధిపతి డా.బి.కెజియారాణి మాట్లాడుతూ ఉద్యోగ నియామక ప్రక్రియలను ఫైనల్ ఇయర్ విద్యార్థులకు తెలియజేయడం కోసం అప్ స్కిల్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. దీనిలో ప్రతిభకనరపచిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు వ్రాత పరీక్ష, టెక్నికల్, హెచ్.ఆర్ ఇంటర్వ్యూ లను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.పి.వెంకటేశ్వరరావు, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఐ.క్యూ.ఎ.సి డైరెక్టర్ డా.వి.పెర్సిస్, విభాగాధిపతి డా.బి.కెజియారాణి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డి.దాసు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ కె.పద్మరాజు

## గూడెం క్యాంపస్ లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్ లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపల్ ఆచార్య కె.శ్రీరమేష్ జాతీయ పతాకాన్ని ఎగురువేసి స్వాతంత్ర్య దినోత్సవ సందేశానిచ్చారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైభవంగా ప్రారంభమైన సహస్రాబ్ది జాతీయ సదస్సు





సహస్రాబ్ది ఉత్సవాల్లో రాజమహేంద్రవరాన్ని, చాళుక్యుల పరిపాలనా కాలాన్ని ప్రతిబింబించే నృత్య రూపకంతో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

**16.08.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నన్నయ మహాభారతరచన, రాజరాజనరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలు సందర్భంగా రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం వైభవంగా ప్రారంభమైంది. కేంద్ర సాహిత్య అకాడమీ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన సహస్రాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథులు వీసీ కొప్పిరెడ్డి పద్మరాజు, సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, తెలుగు సంస్కృత పండితులు శలాక రఘునాథ శర్మ, తెలుగు సంస్కృత అకాడమీ చైర్ పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, తెలుగు ప్రాకృత మరియు సంస్కృత పండితులు బేతవోలు రామబ్రహ్మం, కన్వీనర్ సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సి.మృణాళిని, సదస్సు కన్వీనర్ డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్ లు హాజరై జ్యోతిప్రజ్వలన చేసి జాతీయ సదస్సును ప్రారంభించారు. వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ ఆదికవి నన్నయ పేరుతో ఉన్న విశ్వవిద్యాలయంలో సహస్రాబ్ది ఉత్సవాలు జరగడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాజరాజ నరేంద్రుడు 1002 లో జన్మించారని, విమలాదిత్యుని తర్వాత రాజరాజనరేంద్రునికి క్రీ.శ.1022 ఆగస్టు 16 న పట్టాభిషేకం జరిగిందని అన్నారు. తంజావూరు మహారాజు రాజేంద్రచోళుని (మేనమామ) కుమార్తె అమ్మంగదేవితో వివాహం జరగడంతో చోళ, చాళుక్యుల మధ్య బంధం మరింత బలపడిందన్నారు. ఇతని కుమారుడు రాజేంద్రుడు (కులోత్తుంగ చోళుడు). రాజరాజనరేంద్రునికి ముందు తూర్పుచాళుక్యులు వేంగి (ఏలూరు సమీపంలో ఉన్న- పెదవేగి)ని రాజధానిగా చేసుకుని పరిపాలించారని చెప్పారు. రాజరాజనరేంద్రుడు దాయాదులతో మరియు శత్రురాజులతో జరుగుతున్న పోరును తప్పించుకోవటానికి రాజమహేంద్రపురం నగరాన్ని నిర్మించి తన రాజధానిని 1022లో ఇక్కడకు మార్చారన్నారు. రాజరాజనరేంద్రుని ఆస్థాన పండితుడు నన్నయభట్టు అని, నన్నయ పూర్వీకులు తెలుగు సంస్కృతభాషలో శాసనాలు రాసినట్టుగా ఆధారాలు లభిస్తున్నాయన్నారు. దీనినిబట్టి పండితవంశంలో పుట్టిన నన్నయ తన సంకల్పంతో తెలుగు భాషా సాహిత్యాలకు దిశానిర్దేశం చేశారని చెప్పారు. రాజరాజ నరేంద్రునికి ఇష్టమైన పనుల్లో భారతాన్ని వినడం ఒకటన్నారు. మహారాజు తమ పూర్వులు, చంద్రవంశపు రాజులైన కౌరవ, పాండవుల చరిత్ర అయిన మహాభారతం జయసంహిత పేరుతో సంస్కృత భాషలో ఉందని, తమిళ కన్నడ భాషల్లో అది తర్జుమా అయిందని తెలుగులో కూడా మహాభారతం ఉండాలని... దానిని తెలుగులో రచించాలని నన్నయ మహాకవికి రాజరాజ నరేంద్రుడు ప్రేరణ ఇచ్చారని అన్నారు. దాని ఫలితమే ఆంధ్ర మహాభారత రచన అయిందని, అది తెలుగులో ఆదికావ్యంగా నన్నయ ఆదికవి అయ్యారని చరిత్రక విషయాలను వివరించారు. విశ్వవిద్యాలయంలో చక్కని కార్యక్రమాన్ని నిర్వహించడానికి ముందుకు వచ్చిన కేంద్ర సాహిత్య అకాడమీ వారిని తెలుగు సాహిత్యవేత్తలను వీసీ అభినందించారు. సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ సాహిత్య కార్యక్రమాలలో భాగంగా రాజమహేంద్రవరం రావడం ఇదే తొలిసారని అన్నారు. ఆంధ్రమహాభారత రచన ప్రారంభ సందర్భంలో రావడం తనకెంతో ఆనందమన్నారు. రాజరాజనరేంద్రుడు గురించి, నన్నయ గుర్తించి విశేష వివరాలను తెలియజేసారు. తెలుగు ప్రాకృత మరియు సంస్కృత పండితులు బేతవోలు రామబ్రహ్మం మాట్లాడుతూ ఇటువంటి సదస్సు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం చేపట్టడం సార్థమైన కార్యక్రమమని అన్నారు. విశ్వవిద్యాలయం వారిని, సాహిత్య అకాడమీ వారిని అభినందించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించిన మహాభారత వ్యాఖ్యనంలో కొన్ని పొరపాట్లు దొర్లాయని వాటిని పరిష్కరించిన అనంతరం పునర్ముద్రణ చేయాలని, దీనికి లక్ష్మీ పార్వతి స్పందించాలని కోరారు. తెలుగు సంస్కృత పండితులు శలాక రఘునాథ శర్మ మాట్లాడుతూ నన్నయ మహాభారతరచన, రాజరాజనరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది శుభాకాంక్షలను తెలియజేసారు. తెలుగు జాతికి గొప్ప విషయాలను తీసుకోవడం, ఇవ్వడం తెలుసన్నారు. శిల్పాన్ని, శబ్దశక్తిని ఉపయోగించడంలో ఆదికవి నన్నయ కు ఎంతో ప్రత్యేకత ఉందని తెలిపారు. పత్ని అనే పదాన్ని యజ్ఞ సమయంలో ఉపయోగించేవారని సూచించారు. నన్నయ రచనల్లో నూతన శిల్పాన్ని ఆయన ఆవిష్కరించారు. తెలుగు సంస్కృత అకాడమీ చైర్ పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ ఈ నెల 29న గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి, తెలుగు భాషా దినోత్సం కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ



విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ తరుపున కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. రాజరాజనరేంద్రుడు సాహిత్యాన్ని పోషించారని, నన్నయ చే మహాభారత ఆంధ్రీకరణకు పూనుకొన్నారని, నన్నయ ఆదికవి అని నొక్కి చెప్పారు.కల్పన కథలు నమ్మవద్దని, దుర్విమర్శలకు తావు లేకుండా తెలుగు భాష ఔన్నత్యాన్ని పెంపొందించాలని చెప్పారు. కన్వీనర్ తెలుగు సలహా మండలి సాహిత్య అకాడమీ సి.మృణాళిని మాట్లాడుతూ పుణ్యం కోసం రామయణాన్ని పురుషార్థం కోసం భారతాన్ని చదవాలన్నారు. ఉపాఖ్యానాలలో ఆరితేరిన వారు నన్నయ అన్నారు. విశ్వనాథ సత్యనారాయణ భారత అవతరణం అనే నాటకంలో వ్యాస వాల్మీకులు నన్నయ ప్రతిభను చూసి ఈర్ష చెందినట్లు వర్ణించారని, వెయ్యేళ్ళ తరువాత క్డూడా నన్నయ గురించి ఇటువంటి సదస్సు జరగడం చూసి వారు ఎంతో ఆశ్చర్యపడతారని వ్యాఖ్యానించారు. నన్నయ మహాభారతరచన, రాజరాజనరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది రెండు రోజుల ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, సదస్సు కన్వీనర్, డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్, కో.కన్వీనర్లు డా.టి.వాసు, డా.టి.సత్యనారాయణ, డా.డి.లక్ష్మీనరసమ్మ, డా.సిహెచ్.మురళీకష్ణ, డా.పి.ఎ.నాయుడు, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సహస్రాబ్ది ఉత్సవాలు విజయవంతం





ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో రెండురోజులు నిర్వహించిన నన్నయ మహాభారతరచన, రాజరాజనరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలు గురువారంతో ముగిసాయి. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, కేంద్ర సాహిత్య అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన సహస్రాబ్ది ఉత్సవాలు వెయ్యేళ్ళ సాహిత్య, చరిత్రక విషయాలను ప్రతిబింబిస్తూ విజయవంతంగా జరిగాయి. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో రెండవ రోజు ఉదయం ప్రారంభమైన సమావేశానికి తెలుగు, ప్రాకృత మరియు సంస్కృత పండితులు బేతవోలు రామబ్రహ్మం అధ్యక్షత వహించి పత్రసమర్పణ చేసారు. నన్నయ భారతం : భాషావైభవం అనే అంశంపై బూదాటి వెంకటేశ్వర్లు, నన్నయ కథాకథనశిల్పం అనే అంశంపై విస్తాలి శంకరరావు, నన్నయ భారతం : ప్రతినాయకుల చిత్రణ అనే అంశంపై సిహెచ్.లక్ష్మణచక్రవర్తి పత్ర సమర్పణలు చేసారు. తరువాత సమావేశంలో బూదాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నన్నయ భారతం : పద్యశిల్పం అనే అంశంపై పేరి రవికుమార్, నన్నయ భారతంలో కనిపించే చాళుక్యశైలి అనే అంశంపై శీలం శ్రీనివాసరావు, నన్నయ వర్ణించిన పండిత సభలు అనే అంశంపై కె.వి.ఎన్.డి.వరప్రసాద్ పత్రాలను సమర్పించారు. చివరి సమావేశానికి నన్నయ ఉపశ్రుతి అనే అంశంపై రంకిరెడ్డి రామమోహనరావు అధ్యక్షత వహించి పత్రసమర్పించగా, నన్నయ ప్రకృతి వర్ణనలు అనే గరిమెళ్ళ సత్యశేషగిరి సోమయాజి, నన్నయపై పరిశోధనలు అనే అంశంపై వెలుదండ నిత్యానందరావు, నన్నయ కథాకథనశిల్పం అనే అంశంపై సి.మృణాళిని పత్రాలను సమర్పించారు. నన్నయ సాహిత్యంపై పండితులు అందించిన పత్రసమర్పణలపై వీసీ ఆచార్య కె.పద్మరాజు స్పందించి ఆదికవి నన్నయ పేరుతో ఉన్న విశ్వవిద్యాలయంలో చక్కని కార్యక్రమాలు జరగడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్ లో తెలుగు భాషా,సాహిత్యం పై మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేసారు. పత్రసమర్పణ చేసిన సాహిత్యవేత్తలకు నన్నయ జ్ఞాపికను బహూకరించి అభినందించారు.నన్నయ నందంపూడి శాసనం బ్రోచర్ ను సభాముఖంగా ఆవిష్కరించారు. ముగింపు సమావేశానికి అధ్యక్షత వహించిన సదస్సు కన్వీనర్ కె.వి.ఎన్.డి.వరప్రసాద్ మాట్లాడుతూ రెండు రోజుల సదస్సును విజయవంతం చేసిన సాహిత్య ప్రముఖులకు, సాహిత్య అకాడమీకి, విశ్వవిద్యాలయ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ సహస్రాబ్ది ఉత్సవాలను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించడం సార్థకత అయిందన్నారు. జాతీయ సదస్సు ప్రతిపాదనను అంగీకరించి విజయవంతంగా నిర్వహించిన కేంద్ర సాహిత్య అకాడమీ వారిని అభినందించారు. ఇస్రో శాస్త్రవేత్త రేమెళ్ళ లక్ష్మీనరసింహమూర్తి మాట్లాడుతూ నన్నయ సాహిత్యాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో భావితరాలకు అందించాలని అన్నారు. ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ కు, సాహిత్య పరిశోధనలకు ఆకాశమే హద్దు కాదన్నారు. భవిష్యత్ లో విశ్వవిద్యాలయం సాహిత్య కార్యక్రమాలు మరిన్ని ఏర్పాటు చేయాలని, సాహిత్యాన్ని పెంపొందించుకోవాలని తెలియజేసారు.డా.దొంతరాజు లక్ష్మీ నరసమ్మ వందన సమర్పణ చేసి కార్యక్రమాన్ని ముగించారు. అనంతరం అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేసారు. పరిశోధన పత్రాలను అందించిన వారికి, హాజరైన వారికి సర్టిఫికెట్స్ అందజేసారు.



# నన్నయలో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు



జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న వీసీ ఆచార్య కె. పద్మరాజు

## జాతీయ పతాకాన్ని ఎగురవేసిన వీసీ ఆచార్య పద్మరాజు
## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ ఆచార్య కె.పద్మరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గాడ్ ఆఫ్ హనర్ ను స్వీకరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణాలతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలలకు 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల శు భాకాంక్షలను తెలియజేసారు. ప్రాణాలను పణంగా పెట్టి, ఉద్యమాల్ని నడిపి కష్టనష్టాలను ఓర్చుకొని భారతీయులంతా జాతీయోద్యమంలో ఏకతాటి మీదకు వచ్చారని కాబట్టే మనకు 1947లో స్వాతంత్ర్యం లభించిందని, ప్రతి విజయం వెనుక ఎంతో ఓర్పు, సాధన ఉంటుందని తెలియజేసారు. 1857లో మొదలైన సిపాయిల తిరుగుబాటు దగ్గరనుంచి స్వదేశీ ఉద్యమం, హెూం రూల్ మూమెంట్, ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా మూమెంట్ ఇలా 90 ఏళ్ల పాటు ఏడు ఉద్యమాల ఫలితమే 1947 స్వాతంత్ర్యం. ఈ ఉద్యమంలో ఎన్నో నినాదాలు భారతీయుల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించాయన్నారు. జనాభాలో 40% ఉత్సాహం ఉరకలు వేసే యువత ఉన్న దేశం మనదే కాబట్టి నేటి యువతతోనే మన దేశం శక్తివంతమైన దేశంగా మారుతుందని అన్నారు. సమాజానికి ఉపయోగపడే పరిశోధనలను,ప్రేరణ కలిగించే బోధనను అధ్యాపకులు విద్యార్థులకు అందించాలని ఆశిస్తున్నాను. మన ప్రవర్తన, క్రమశిక్షణ, దినచర్య, డ్యూటీలో నిజాయితీ విశ్వవిద్యాలయానికి సమున్నతమైన పేరు, కీర్తిని కలిగించేలా ఉండాలని యూనివర్సిటీ సిబ్బంది అందరినీ కోరుతున్నాను. ఒక వ్యవస్థలో మనకు లభించిన స్థానాన్ని ఎప్పుడు పవిత్రంగానే భావించాలన్నారు. విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న కళాశాలలు అన్నీ %చీూూజ% గుర్తింపుని పొందే దిశగా కృషి చేయాల్సిని సూచించారు. విద్యార్థులకు స్వీయ క్రమశిక్షణ, విలువల పట్ల అవగాహన కల్పిస్తూ వారు చదువుకుంటున్న చదువులు వారికి ఉపాధి కలిగించేవిగా చూడాల్సిన బాధ్యత కూడా అధ్యాపకులపై ఉందన్నారు. తరువాత యుద్ధ్ సేవ మెడల్, నేవీ సేన మెడల్ గ్రహీత కమోడోర్ ఆదిమూలం చినవెర్రియ్యను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన భారతీయ విద్యావ్యవస్థకు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రాధాన్యత ఉండేదని, నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాలు గొప్ప విద్యాకేంద్రాలుగా ఎదిగాయని గుర్తుచేసారు. ఇటీవల కాలంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. విద్యార్థుల కృషి, పట్టుదలలను ఆయుధంగా చేసుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలని తెలియజేసారు. అనంతరం యూనివర్సిటీ డిప్లమా ఇన్ కూచిపూడి విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి నృత్య ప్రదర్శనలు, ఎం.పి.ఈడీ విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్స్, డీన్స్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ పద్మరాజు










స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా విద్యార్థుల దేశభక్తి ప్రపూరితమైన సాంస్కృతిక కార్యక్రమాలు






# నందంపూడి శాసన పునర్ముద్రణ సంపాదకులు



గవర్నమెంట్ IASE, రాజమహేంద్రవరంలో ఆచార్యులుగా పదవీ విరమణ చేసిన డా.ఆర్.వి.వి. గోపాలచార్యులు పునర్ముద్రించిన నందంపూడి శాసనాన్ని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో శిలాఫలకంపై పునఃప్రతిష్ఠించటం జరిగింది. 1912లో ఈ శాసనాన్ని పరిష్కరించి, ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికలో మొదటిసారిగా ప్రచురించింది జయంతి రామయ్య పంతులుగారు. ఈ సందర్భంగా ఈ శాసన పునర్ముద్రణకు సహకరించిన డా.ఆర్.వి.వి. గోపాలచార్యులు గారికి రాజమహేంద్రవరం ఎం.పీ మార్గాని భరత్ రామ్,తెలుగు సంస్కృత అకాడమీ చైర్పర్సన్ డా.నందమూరి లక్ష్మీపార్వతి,వీసి ఆచార్య కె.పద్మరాజు దుశ్శాలువ, నన్నయ జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నన్నయ, రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది జాతీయ సదస్సు కన్వీనర్ డా.కేవీఎన్.డీ వరప్రసాద్ వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్,డీన్స్ పాల్గొన్నారు.

### నందంపూడి శాసనం

నందంపూడి శాసనంలో రాజరాజ నరేంద్రుడు నారాయణభట్టుకు కోనసీమలో అంబాజీపేట సమీపంలోని నందంపూడి అనే అగ్రహారాన్ని దానమిచ్చిన విషయంతోపాటు, రాజరాజ నరేంద్రుడు పట్టాభిషిక్తుడైన కాలం గురించి కూడా ఈ శాసనం తెలియజేస్తుంది. క్రీ.శ.1022 ఆగస్టు 16 న రాజరాజనరేంద్రుడు పట్టాభిషిక్తుడయ్యాడని ఈ శాసనం తెలియజేస్తుంది. ఈ శాసనానికి మరో ప్రత్యేకత మహాభారత ఆంధ్రీకరణకు పూనుకొన్న ఆదికవి నన్నయ ఈ శాసనాన్ని రచించటం. ఇన్ని ప్రత్యేకతలున్న ఈ శాసనాన్ని , ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ప్రతిష్టింపజేయడం అత్యంత సముచితం. ఈ శాసనాన్ని రాజరాజ నరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది, నన్నయ మహాభారత సహస్రాబ్ది ఉత్సవాల జాతీయ సదస్సు సమయంలో ఇక్కడ ఏర్పాటు చేసిన ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు గారికి,రిజిస్ట్రార్ గారికి, అలాగే ఈ శాసన పునర్ముద్రణకు సహకరించిన డా.ఆర్.వి.వి. గోపాల చార్యులు గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**డా. కె.వి.ఎన్.డి.వరప్రసాద్,**
**కన్వీనర్,సహస్రాబ్ది ఉత్సవాల జాతీయ సదస్సు.**

## కాకినాడ క్యాంపస్‌లో
# స్వాతంత్ర్య దినోత్సవ వేడుక


**15.08.23 (మీడియాసెల్)**




ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు 77వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత క్యాంపస్ లో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి మరియు మల్లాడి సత్య లింగ నాయకర్ విగ్రహాలకు నివాళు లు అర్పించి జాతీయ పతాకాన్ని ముఖ్య అతిథులు క్యాంపస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం కమల కుమారి ఆవిష్కరించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కమల కుమారి మాట్లాడుతూ " మనం ప్రస్తుతం నివసిస్తున్న ఈ భారతదేశం ఎన్నో మహనీయుల స్వాతంత్ర పోరాట ప్రతిమల కారణంగా వచ్చింది అని వారి యొక్క త్యాగాలు గూర్చి మీద స్వతంత్ర ఉద్యమ నాయకుల గురించి విసదీకరించారు. మహాత్ముడు ఆపాదించిన అహింస శాంతి ద్వారానే స్వతంత్రం సాధ్యమని ఏర్పరచుకున్న ఈ స్వతంత్ర భారతదేశంలో ఇప్పటికీ ఎన్నో అసమానతలకు ముఖ్యంగా నిరుద్యోగం, పేదరికం, ప్రాథమిక హక్కుల అణిచివేత, ప్రాంతీయతత్వం, పరమత సహనం లేకపోవడం, స్త్రీల పట్ల హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడం ఇప్పటికీ మణిపూర్ ఇతరత్రా రాష్ట్రాల లో జరుగుతున్న దుశ్చర్యలు గా అభివర్ణించారు విద్యార్థులు అయినటువంటి మీరు ఇటువంటి అంశాలపై అవగాహన కలిగి వాటిని నియంత్రిస్తూ సమ సమాజ స్థాపనకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని చక్కగా ఏర్పాట్లు చేసినందుకు క్యాంపస్ పిడి డాక్టర్ ఏ.సత్యనారాయణ ను, అలాగే సహకరించిన సిబ్బంది మరియు విద్యార్థులను అభినందించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ పోచయ్య, డా. స్టీఫెన్, మహమ్మద్ నదీమ్, వరప్రసాద్ డా.విజయలక్ష్మి, డా. గోపి ,మనోజ్ దేవ, డా. మధుకుమార్, డా. శ్రీదేవి, శ్రీనివాస్, రాధా మాధవి, హేమలత మరియు తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు జండా వందనం చేసి వివిధ సాంస్కృతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


# ఆంధ్రుల సమగ్ర చరిత్ర

## పుస్తకం




తెలుగువారికి,తెలుగు భాషకు మార్గం చూపించిన మహానుభావుల్లో సురవరం ప్రతాపరెడ్డి ఒకరు. ఒక రచయితగా,ఒక సంపాదకునిగా,ఒక సాహితీవేత్తగా,ఒక కవిగా, ఒక సాంఘిక ఉద్యమశీలిగా ఆయన అన్ని ప్రక్రియలను అనగా గద్యం,పద్యం, నాటకం,నవల,జీవిత చరిత్ర మొదలైన వాటిపై పట్టు సాధించి తెలుగు సాహితీ ప్రక్రియలను,తెలుగు భాషను సుసంపన్నం చేశారు. ఈయన రచించిన 40 కి పైగా పుస్తకాలలో అత్యుత్తమనదగ్గ గ్రంథాలలో ఒకటి "ఆంధ్రుల సమగ్ర చరిత్ర". ఈయన సుమారు 20 సంవత్సరాలకు పైగా పరిశోధించి ఈ గ్రంథాన్ని రచించారు. రాజుల చరిత్ర కాక ప్రజా చరిత్రను ప్రాధాన్యంగా తీసుకొని ఈ గ్రంథాన్ని రచించడం జరిగింది. ఇందులో మొత్తం ఎనిమిది అధ్యాయాలు ఉన్నాయి. మొదటి ఐదు తూర్పుచాళుక్య యుగం, కాకతీయుల యుగం, రెడ్డి రాజులు,విజయనగర సామ్రాజ్యం. తర్వాత మూడు అధ్యాయాలు 1600 నుంచి 1907 వరకు జరిగిన ఆంధ్రజాతి సామాజిక చరిత్రను చక్కగా వర్ణించారు. 50 సం. ముందు చక్కని వర్ణనలతో, అద్భుతంగా,ప్రామాణికంగా రాయడం సురవరం ప్రతాపరెడ్డికే చెల్లింది. ఈ విషయంలో ఇప్పటి రచయితలకు కూడా ఈయన రచన వైఖరి ఎంతో ప్రేరణగా నిలుస్తుంది. ఈ గ్రంథంలో సురవరం ప్రజల వైపు నుండి ఒక్కొక్క యుగంలో రాజ్య వ్యవస్థ ఎలా పనిచేస్తూ వచ్చాయో విశ్లేషించారు. ప్రజల ఆచార వ్యవహారాలను తెలియజేస్తూ విద్య,వైద్యం, కళలు,వ్యాపారం, శాంతిభద్రతలు వంటి అన్ని రంగాలను వివరించారు, ఒక్కొక్క యుగములో ప్రజల ఆర్థిక,సామాజిక స్థితిగతులు ఎలా ఉండేవో తెలియజేస్తూ సాహిత్యాల నుంచి ఆధారాలను కూడా తీసుకొని రాయడం జరిగింది. "మనం కూడా చరిత్రకెక్కిన వాళ్లమే... మొగలులు,ఢిల్లీ సుల్తానుల కంటే మన చరిత్ర ఏనాటికి తక్కువ కాదు" అనే ఉద్దేశంతో ఈ "ఆంధ్రుల సమగ్ర చరిత్ర" అనే ప్రజా చరిత్రను రచించారు. ఆదర్శాలను మాటల్లో చెప్పడం కాకుండా దానిని ఎలా ఆచరించాలో ఈ పుస్తకంలో వివరించారు. వ్యవహారిక భాషకు అధిక ప్రాధాన్యత ఇచ్చి తెలుగు భాషకు ఒక రూపుని ఇచ్చారు. ఆంధ్రుల చరిత్రపై ఎన్ని గ్రంథాలు వచ్చిన మొట్టమొదటిగా ఈయన రాసిన ఈ పుస్తకం ఎంతోమంది రచయితలకు ప్రేరణగా నిలిచింది అనడంలో ఎటువంటి సందేహము లేదు. అందుకే ఈ పుస్తకం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన మొదటి తెలుగు పుస్తకంగా నిలిచింది.

**- బి.సుశాంత్ కుమార్**






ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్. డిపార్ట్మెంట్ ఆఫ్ ఈ.సి.ఈ, ఈ.ఐ.ఈ ఫేర్వెల్ పార్టీ ఘనంగా జరిగింది. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన ఈ కార్యక్రమానికి ఇంజనీరింగ్ అధ్యాపకులు హాజరై విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి - దేశభక్తి



ఉవ్వెత్తున ఎగసిన కెరటం.. ఆనాటి స్వాతంత్ర్యోద్యమం..
అహింస ఆయుధమని నమ్మి నడిచిన సిద్ధాంతం..
శిఖరమెత్తున ఎగరాలని నా త్రివర్ణ పతాకం..
కోటి గొంతులు పలికిన నినాదం... వందే మాతరం...

లాఠీలు.. తూటాలు చీల్చినా.. మడమ తిప్పని నిబ్బరం...
రుధిర ధారలలో సమిధలైన త్యాగధనుల పుణ్యఫలం...
ప్రతీ భారతీయుడు కలగన్న స్వేచ్ఛా భారతం..
దేశభక్తితో పలికే పంచాక్షరి మంత్రం.. వందే మాతరం...

కీచక తెల్ల దొరల ఉక్కు సంకెళ్లు తెంచుకున్న బానిసత్వం..
నా దేశం... నా కోసం... పలికిన సందేశం...
మరవరాదని.. మరవకూడదని అందించిన వారసత్వం..
తరం తరం.. నిరంతరం.. నా భారతీయ తత్వం.. వందే మాతరం


**- అవసరాలు మాధవరావు,**
**విజ్ఞాన్ డిగ్రీ కళాశాల,**

## ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం (ఆగస్ట్ 19)

జీవితం గాలిబుడగ
కళ శాశ్వతం
గత స్మృతుల
జ్ఞాపకార్థం
ఒక్క ఫోటో....!!

విశ్వవిద్యాలయ,
నన్నయవాణి
ఫోటోగ్రాఫర్ శ్రీ
రాజీవ్ కి....
శుభాకాంక్షలు!!


- ఎడిటర్



## మంచిమాట

*స్వాతంత్ర్యం అనేది కేవలం మానసికమైన విషయం. స్వతంత్రంగా జీవించే అవకాశం ఉండీ బానిస భావాలు కలిగిన వ్యక్తి కంటే, స్వతంత్ర భావాలున్న బానిస వెయ్యి రెట్లు మేలు!*

*- బాల గంగాధర తిలక్*



# ఆగస్ట్ 22 ప్రపంచ జానపద దినోత్సవం







ప్రపంచీకరణ ప్రభావంతో జానపద విజ్ఞానం కనుమరుగయ్యే స్థితిలో ఉంది. దానికి కారణాలు అనేకం. ఒకవైపు ప్రజలు,మరోవైపు ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయి. మన ప్రాచీన సాంస్కృతిక వారసత్వ సంపద అతికొద్ది కాలంలోనే పూర్తిగా కనుమరుగయ్య స్థితి కనిపిస్తుంది. ఒకప్పుడు భక్తి తత్వాన్ని,వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించిన జానపద కళలు కాలగర్భంలో కలిసిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. కళలను పరిరక్షించే స్థితిలో ప్రజలు కూడా లేరు. కళాకారులను పోషించే, ఆదరించే స్థితిలో సమాజాలు లేవు. ఇది ఒక గొప్ప తప్పిదంగా భావించాలి. వందల కొలదిగా ఉన్న మన కళారూపాలు మసకబారుతున్నాయి. జానపద విజ్ఞాన దినోత్సవాలు అక్కడక్కడ మొక్కుబడిగా కొనసాగుతున్నాయి. కళాకారులను కళలను గుర్తించి ఆదరించే జాడ కనబడటంలేదు. కళలను విస్మరిస్తూ కంప్యూటర్లలో చూసే స్థితి ప్రస్తుతం నడుస్తోంది.

డబ్ల్యు.జే.థామ్స్ 1846 లో “ ది ఎథీనియం “ అనే పత్రికకు జానపద విజ్ఞానానికి కొత్త నిర్వచనం ఇస్తూ జానపద విజ్ఞానానికి సరైన పదంగా ఫోక్ లోర్ అనే పదాన్ని సూచించాడు. అప్పటినుండి జానపద విజ్ఞానం ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందింది. 1846 ఆగస్టు 22 న ఇచ్చిన ఈ నిర్వచనమే ప్రపంచ జానపద విజ్ఞాన పరిశోధనలకు దారితీసింది. జానపద దినోత్సవం అదే రోజున నిర్వహించటం సంప్రదాయంగా వస్తుంది. 177 సంవత్సరాల క్రితం ఇచ్చిన నిర్వచనం నేటికీ విశ్వవిద్యాలయాల్లో వివిధ అంశాలపై పరిశోధనలకు అధ్యయనానికి నూతన ఒరవడిని సృష్టించి శాఖలుగా విస్తరిల్లి భాషా, సాహిత్య, సాంస్కృతిక,సాంఘిక కళారంగాల వరకు విస్తరించి వర్ధిల్లుతోంది జానపద విజ్ఞానం.

జానపదుల భాష,యాస, అలంకారాలు,కళారూపాలు,విభిన్న ప్రదర్శన రీతులు, సాంఘిక ఆచార సంప్రదాయాలు, తీర్థాలు, తిరునాళ్ళు, ఆరాధన పద్ధతులు, నమ్మకాలు, ఆహార సంస్కృతి, వస్తు సంస్కృతి, కుల పురాణాలు, వంటావార్పు, వైద్య విధానం చారిత్రక సాంస్కృతిక సాంఘిక అంశాలు వంటి వాటిని గుర్తుకు తెచ్చుకోవడం ఆనాటి జనజీవన విధానంతో పాటు ఆనాటి మానవ సంబంధాలు,మానవీయ విలువలు వంటివి ఆయా గీతాల్లో, కథా సాహిత్యంలో కనిపిస్తాయి. వాటిని విశ్లేషిస్తే మన ప్రాచీన జీవన ప్రతిబింబం జానపద విజ్ఞానంగా ప్రతిబింబిస్తుందని గుర్తిస్తాం. అందుకే జానపద విజ్ఞానాన్ని పరిరక్షించి నేటి తరానికి వివరించి భవిష్యత్ తరానికి అందించే ప్రయత్నం చేయాలి.

నన్నయ విశ్వవిద్యాలయంలో జానపద విజ్ఞానం మీద 2017 ఆగస్ట్ లో జాతీయ సదస్సును ప్రారంభించి నేటి వరకు ఆగస్టు 22న జానపద విజ్ఞాన దినోత్సవాలను నిర్వహిస్తూ నిర్వహిస్తున్నాం.ఆయా సదస్సులలో ప్రముఖులైన సుద్దాల అశోక్ తేజ, అందెశ్రీ, గోరటి వెంకన్న, వంగపండు ప్రసాదరావు వంటి వారు పాల్గొని జానపద విశేషాలను వివరించారు.

- డా.తరపట్ల సత్యనారాయణ తెలుగుశాఖ,
నన్నయ విశ్వవిద్యాలయం





# కూచిపూడి డిప్లమో కోర్స్



మార్చి 2022 లో జరిగిన జాతీయ సంస్కృతి మహెూత్సవంలో విశ్వవిద్యాలయ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు కూచిపూడి డిప్లమా కోర్సు కు పునాది. ఆరోజు విద్యార్థుల ప్రదర్శనను చూసిన అప్పటి ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు గారు ఆంధ్రప్రదేశ్ కి సాంస్కృతిక రాజధాని అయిన రాజమహేంద్రవరంలో ఉన్న మన విశ్వవిద్యాలయంలో కళలను అభివృద్ధి చేసే లక్ష్యంగా ప్రోత్సహిస్తూ ఇటువంటి కోర్సులు అందుబాటులో ఉంచటం వలన ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారని సూచించడం వలన ఈ కోర్సు రూపుదిద్దుకుంది.

జూన్ 2023 నుంచి తరగతులు ప్రారంభమై ఇప్పటికి రెండు నెలలు మాత్రమే పూర్తయినప్పటికీ విద్యార్థులు శ్రద్ధతో సాధన చేసి నేర్చుకోవడం ఎంతో సంతోషకరం. తక్కువ సమయంలోనే వీరు ఎక్కువ సాధన చేసి స్వాతంత్ర్య దినోత్సవం మరియు రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది కార్యక్రమాల్లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని విశ్వవిద్యాలయ ఉపకులపతివర్యులైన ఆచార్య కె. పద్మరాజు గారు, కార్యక్రమానికి విచ్చేసిన వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, సాహితీవేత్తల ప్రశంసలు పొందడం చాలా ఆనందదాయకం.

పార్ట్ టైం డిప్లమో ఇన్ కూచిపూడి నృత్యం కోర్సు జూన్ ఒకటవ తేదీన 2023 నుంచి తరగతులు ప్రారంభమైనవి. విద్యార్థులు ఎంతో శ్రద్ధతో నాట్యాన్ని నేర్చుకోవడానికి తరగతులు హాజరవుతున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని వారు చేసిన ప్రదర్శనలతో అందరిని ఆకట్టుకున్నారు. కూచిపూడి సంప్రదాయ వస్త్రధారణతో, విద్యార్థులు జాతీయ జెండాలతో పెరేడ్ లో పాల్గొన్నారు. నమో నమో భారతాంబే... గీతానికి చక్కటి నృత్యాభినయం ప్రదర్శించారు. ఆజాదీకా అమృత మహూత్సవ్ సందర్భంగా విడుదల చేసిన, ఎంతో ప్రఖ్యాతి పొందిన హర్ ఘర్ తిరంగా... గీతానికి డిప్లమో విద్యార్థులు అందరూ సెమి క్లాసికల్ నృత్యాన్ని ప్రదర్శించారు. కీబోర్డుపై సారే జహాసే అచ్చా గీతాన్ని ప్లే చేసి ప్రశంసలు అందుకున్నారు.

విశ్వవిద్యాలయ అధికారుల మన్ననలతో, విద్యార్థుల ఉత్సాహంతో తెలుగువారి కూచిపూడి నృత్యరీతి విశ్వవిద్యాలయం ద్వారా మన ప్రాంతం వారికి అందుతున్నందుకు సంతోషాన్ని తెలియజేస్తూ సహకరిస్తున్న వారందరికీ ధన్యవాదాలు అందిస్తున్నాను.

- కె.శ్రీరాజరాజేశ్వరిదేవి
కూచిపూడి శిక్షణ అధ్యాపకురాలు
నన్నయ విశ్వవిద్యాలయం

# నృత్యరీతికి భక్తినీరాజనం!



నన్నయ విశ్వవిద్యాలయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కూచిపూడి పార్ట్ టైం డిప్లమో కోర్సు లో చేరిన స్వల్ప మూడు నెలల కాలం లోనే ‘ ఆదికవి నన్నయ మహాభారత రచన, మరియు రాజరాజనరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలు’ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో భాగంగా పవిత్ర గోదావరి మాతని, ఆ ఒడ్డున వెలిసిన రాజమహేంద్రవరం నగరాన్ని, దానిని పరిపాలించిన రాజరాజ నరేంద్రుని,మహాభారతాన్ని తెనిగించిన నన్నయ ప్రతిభని, మరియు ఈ కర్మభూమిలో జన్మించిన కందుకూరి వీరేశలింగం పంతులు గారు మొదలగు వారి మహనీయతని ప్రతిబింబించే నృత్య రూపకంలో పాల్గొనే అవకాశం రావటం,ఆ ప్రయత్నంలో సఫలీకృతం అయినందుకు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారు మొదలగు మహనీయుల మెప్పు లభించుట మేము చేసుకున్న పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాం.ఈ సువర్ణ అవకాశం కల్పించిన నన్నయ విశ్వ విద్యాలయంవారికి, మాగురువు రాజేశ్వరిగారికి మేము ఎప్పటికీ కృతజ్ఞులం.

డా.వెత్సా సాహితీ సౌందర్య, గాయత్రీమెహల్

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in